
ప్రజాశక్తి
బుధవారం 30 జులై 2025
5
పార్వతీపురం మన్యం



## ఐటిడిఎ క్యాంటీన్ నిర్వహణకు బహిరంగ వేలం

**ప్రజాశక్తి - పార్వతీపురం**

పట్టణంలోని ఐటిడిఎ క్యాంటీన్ నిర్వహణకు బహిరంగ వేలం ద్వారా గిరిజన అభ్యర్థులకు కేటాయించడానికి ఆహ్వానిస్తున్నామని పిఒ అశుతోష్ శ్రీవాత్సవ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1న క్యాంటీన్ నిర్వహణకు జరగబోయే బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. క్యాంటీన్ నిర్వహణకు రూ:30 వేలు ప్రాజెక్టు అధికారి, ఐటిడిఎ, పార్వతీపురం పేరున జమ చేయాలని సూచించారు. ప్రతి నెలా రూ:2 వేలు అద్దె చెల్లించాలన్నారు. ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు ఐటిడిఎ క్యాంటీన్ నిర్వహణకు బహిరంగ వేలంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

# వికలాంగులు అన్ని రంగాల్లోనూ రాణించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - పార్వతీపురం**

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలని, అందుకోసమే పర్పుల్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యంలో భాగంగా అన్ని తరగతుల, వర్గాల ప్రజల్ని ముందుకు తీసుకువెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా వికలాంగులను కూడా అన్ని రంగాల్లో ముందంజలో తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సిఆర్‌సి (కాంపోజిట్ రీజినల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రిహాబిలిటేషన్, ఎంపవర్‌మెంట్ ) నెల్లూరు, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్ కార్యక్రమం మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా పర్పుల్ ఫెయిర్ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఇక్కడ వికలాంగులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించామని, వారిలో ఉండే ప్రతిభతో చక్కని వస్తువులను తయారు చేశారని అన్నారు. శారీరకంగా మనసు పెట్టి ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ కల్పిస్తుందని, ఆరోగ్యపరంగా సమస్యలు ఉంటే మనకి ఎర్లీ ఇంటర్వెన్షన్స్ సెంటర్ కూడా పక్కనే ఉందని అన్నారు. బ్రెయిన్ హెల్త్ ఆర్టిజం మొదలైన వారికి చికిత్స ఇవ్వడానికి పార్వతీపురంలో త్వరలోనే నీతి అయోగ్ ఆధ్వర్యాన ఒక సెంటర్ కూడా ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. భవిత సెంటర్స్ ద్వారా వికలాంగులకు అవసరమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల జరిగిన గ్రాండ్ బ్రిక్స్‌లో కురుపాం విద్యార్థి 1500 మీటర్స్, 400 మీటర్ల పరుగుపందెంలో ఒక గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడని, తనలోని లోపాన్ని చూసుకోకుండా విజయాన్ని సాధించడం గర్వకారణమని తెలిపారు. వికలాంగుల్లో ఆత్మ విశ్వాసం ఎక్కువగా ఉంటుందని, లోపాన్ని విడనాడి శారీరకంగా ముందుకెళ్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. అంతకుముందు వివిధ శాఖలు, సంస్థలు ఏర్పాటుచేసిన ప్రదర్శన స్టాళ్లను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరితో కలిసి పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు ఉపకారణాలను, స్టాళ్ల యాజమాన్యాలకు జ్ఞాపికలను అందజేశారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉన్నాయన్నారు. వికలాంగులకు మనోధైర్యాన్ని ఇచ్చి ముందుకు నడిపిస్తే, వారు కూడా ఒక మంచి స్థాయిలో ఉంటారని, కాబట్టి తల్లిదండ్రులు ఆ మనోధైర్యాన్ని ఇవ్వాలని సూచించారు. కొంతమంది ట్రైసైకిళ్లు కావాలని తన దగ్గరకు వచ్చారని, వీటితో అవసరమైన వాటన్నింటిని సీఆర్సీ, నెల్లూరు సంస్థ ద్వారా అందజేస్తామని తెలిపారు. కావున వీటిని మీరంతా వినియోగించుకొని ఒక మంచి ఉన్నత స్థాయిలోకి వెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ సీఆర్సి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. సామాన్యులతో పాటు వికలాంగులకు కూడా ప్రభుత్వం అన్ని సహాయ సహకారాలు అందిస్తుందని, మీకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉన్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీఆర్సీ డైరెక్టర్ మనోజ్ కుమార్, విభిన్నప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎడి ఎల్ఎన్‌వి శ్రీధర్, డిఇఒ బి.రాజకుమార్, డిఐఇఒ వై.నాగేశ్వరరావు, ఎస్ఎస్ఎ పిఒ రెడ్డి తేజేశ్వరరావు, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ పీడీలు ఎం.సుధారాణి, టి.కనకదుర్గ, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు ప్రధానం : కలెక్టర్

**ప్రజాశక్తి - పార్వతీపురం**


జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు ప్రధానమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విద్యా శాఖాధికారులను తేల్చిచెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాలు తక్కువగా వుందని, ప్రవేశాలకు ఇంకా గడువు ఉన్నందున, విద్యార్థులు చేరేలా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. ఈ నెలాఖరుకు ప్రవేశాలు పెరగాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాల విద్యపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్క విద్యార్థి కూడా ఆరు బయట తిరగరాదని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను తల్లితండ్రులను వివరించి విద్యార్థులు చేరేలా చొరవ తీసుకోవాలని అన్నారు. అలాగే ప్రతి పాఠశాల, కళాశాలలో మౌలిక సదుపాయాలు కచ్చితంగా ఉండాలని, ఉత్తీర్ణత శాతం పెరగాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ, సీతంపేట ఎంఇఒలు ప్రవేశాలపై దృష్టి సారించాలన్నారు. ఆధార్ సమస్యలు ఉన్న చోట్ల వాటిని పరిష్కరించి విద్యార్థులను చేర్పించాలని తెలిపారు. మై స్కూల్ - మై ప్రైడ్ ప్లస్ లో ప్రత్యేక అధికారులకు మరిన్ని బాధ్యత లను అప్పగిస్తున్నట్లు చెప్పారు. గతంలో చేపట్టిన కార్యక్రమాలతో పాటు ప్లస్ లో అనిమియా, అకడమిక్ విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వివరించారు. సమావేశంలో డిఇఒ బి.రాజ్‌కుమార్, ఏడీ జి.రమాదేవి, ఎస్ఎస్ఎ ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఆర్.కృష్ణవేణి, ఐసీడిఎస్ పీడీ డా. టి.కనక దుర్గ, బీసీ సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, ఎంఇఒలు, ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

# తీరు మార్చుకోకపోతే తోక కత్తిరిస్తా?

## ఎమ్మెల్యే బోనెలకు సిఎం చంద్రబాబు క్లాస్

**ప్రజాశక్తి - పార్వతీపురం**

ఎమ్మెల్యేల పనితీరు మార్చుకోకపోతే తోక కత్తిరిస్తానని సిఎం చంద్రబాబు నాయుడు వారికి క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. గడచిన ఏడాది కాలంలో టిడిపి ఎమ్మెల్యేల పనితీరుపై పార్టీ, ప్రభుత్వం నిర్వహించిన సర్వే నివేదికల ఆధారంగా డేంజర్ జోన్‌లో ఉన్న ఎమ్మెల్యేలను పిలిపించుకున్న చంద్రబాబు నాయుడు ఇటీవల తన క్యాంపు కార్యాలయంలో వారిని హెచ్చరించారనే ఆ పార్టీలో ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో విచ్చలవిడిగా అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న, పార్టీ నాయకులు, కార్యకర్తలను విస్మరించిన ఎమ్మెల్యే లను సిఎం పిలిపించారు. ఏడాదిలో వారి వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిందని, ఇక వారిని గాడిలో పెట్టకపోతే భవిష్యత్తు ప్రమాదం లో పడుతుందని భావించిన చంద్రబాబు నాయుడు మొత్తం 21 మంది ఎమ్మెల్యేలను పిలిపించి ఒక్కొకరికి సుమారు గంటసేపు క్లాస్ పీకి వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. మన్యం జిల్లాలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కూడా చంద్రబాబు నాయుడు పిలిచి తీవ్ర స్థాయిలో మందలించారని ఆ పార్టీలో ప్రచారం జరుగుతోంది. పార్టీకి మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలిచి ఉన్న నాయకులు, కార్యకర్తలను గౌరవించకపోవడం, వారిని దూరంగా పెట్టడంపై ఎమ్మెల్యేపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఉద్యోగాలకు డబ్బులు వసూలు చేయడం, బదిలీలు, ఉద్యోగ నియామకాలలో జోక్యం చేసుకోవడం, భూదందాలను ప్రోత్సహించడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్న నేపథ్యంలో పిలిచి హెచ్చరించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భవిష్యత్తులో పనితీరు మార్చుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని పోవాల్సిన అవసరం ఉందని, అలా చేయకపోతే తోక కత్తిరిస్తానని సిఎం ఎమ్మెల్యేను హెచ్చరించడం చర్చనీయాంశమవుతోంది. సర్వే నివేదికలతో పాటు ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ఎమ్మెల్యే బోనెల పనితీరుపై పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించి ఆయన ముందుంచినట్లు తెలిసింది. అంతే కాకుండా జిల్లా, మండల అధికారులపై దూకుడు ప్రదర్శించడం, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని ఒత్తిడి చేయడం, హెచ్చరించడం వంటి అంశాలపై కూడా సిఎం క్లాస్ పీకారనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.



సిఎంను కలిసిన ఎమ్మెల్యే విజయచంద్ర (ఫైల్)



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎల్ఆర్ ఎడి గోవిందరావు

# అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ఇల్లు

## ఎస్ఎస్ఎల్ఆర్ ఎడి ఆర్.గోవిందరావు

**ప్రజాశక్తి - పార్వతీపురం**

జిల్లాలో అర్హత గల ప్రతి ఒక్క కుటుంబానికీ రానున్న రెండేళ్లలో ఇల్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సర్వే, భూనమోదు విభాగం అదనపు సంచాలకులు ఆర్.గోవిందరావు తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, రీసర్వే, పీజీఆర్ఎస్, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల భూమిని పంపిణీ చేయాల్సి ఉందని, అందుకు తగిన విధంగా చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 2019 కన్నా ముందే అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ పూర్తి చేయాలని, ఈ ప్రక్రియను డిసెంబరు నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ హేబిటేషన్లలో శ్మశాన వాటికకు వెళ్లే దారి లేక అవస్థలు పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, ఉపాధి హామీ నిధులతో వాటికి రోడ్లు చేపట్టాలన్నారు. అలాగే ఆక్రమణకు గురైన స్మశాన వాటికల స్థలాలను గుర్తించి, ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని తిరిగి పొందాలని, దీనికోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పరిష్కరించాలని కోరారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతీ అర్జీపై తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పిజిఆర్ఎస్ ఎండార్స్‌మెంట్ పక్కాగా ఉండాలని, అర్జీల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న రీసర్వే-2 డిశంబరు 27 నాటికి పూర్తి కావాలని తెలిపారు. జెసి ఎస్ఎస్.శోబిక రెవిన్యూ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, లక్ష్యాలు, ప్రగతి నివేదికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అదనపు సంచాలకులకు వివరించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్వో కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్లు డా. పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, రెవిన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### 'తల్లికి వందనం' లబ్ధిదారుల పట్ల నిర్లక్ష్యం వహించిన

# ఎంఇఒలను సస్పెండ్ చేయాలి : సిపిఎం

**ప్రజాశక్తి - సీతానగరం**

తల్లికి వందనం ఒకే ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఆశలు రేకెత్తించి ప్రసారార్భాటంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించిన కూటమి ప్రభుత్వం అధిక విద్యుత్తు వాడకం నిబంధనలు పేరుతో, రాజకీయ కారణాలను చూపి వందలాది మంది లబ్ధిదారులకు మొండిచేయి చూపించిన వైనం మండలంలోని నిడగల్లులో చోటుచేసుకుందని సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. మండలంలోని ఒక్క ఈ గ్రామంలోనే వందమంది వరకు తల్లికి వందనం అందకపోవడం విడ్డూరమని, వీరంతా రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలని అన్నారు. వీరికి విద్యుత్తు వాడకం బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, తప్పుడు నమోదు చేసినందున నష్టపోయామని, అధికారులు అడిగితే నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎవరిని కలవాలో ఏం చేయాలో అర్థం కాక జిల్లా అధికార యంత్రాంగానికి మొరపెట్టుకుంటే, అక్కడ నుంచి గ్రామ సచివాలయానికి వెళ్లండని చెబుతున్నారని అన్నారు. మండలంలో ఇంకా వెలుగులోకి రాని ఇంకా గ్రామాలు చాలా ఉన్నాయని, కొంతమందికి రూ.6వేలు, రూ.8వేలు చొప్పున ఖాతాలో జమ అయినట్లు తమ దృష్టిలోకి వచ్చిందని తెలిపారు. ఇలా జరగడానికి రాజకీయ కోణమా, లేక అధికారుల నిర్లక్ష్యమా అన్నది పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని, అందుకు బాధ్యులైన మండల విద్యాశాఖ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఆర్ఎంపి, పిఎంపి క్లినిక్‌లపై దాడులు

**ప్రజాశక్తి - కురుపాం**

కురుపాంలో గల ఆర్ఎంపి, పిఎంపి క్లినిక్‌పై స్థానిక వైద్యాధికారి బి.ప్రజ్ఞ, హెచ్‌డిటి సురేష్ కుమార్, ఎస్ఐ పి.నారాయణరావుతో కూడిన అధికారులు బృందం మంగళవారం దాడులు నిర్వహించింది. వీరి లైసెన్సు, నిల్వ మందులు, ల్యాబ్‌లను, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ఎంపి, పిఎంపి క్లినిక్‌లపై దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టామన్నారు. లైసెన్స్ లేకుండా వైద్యం చేపడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో గుర్తించిన లోపాలను ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని తెలిపారు.



ఆర్ఎంపి క్లినిక్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి, ఎస్ఐ, హెచ్‌డిటి

# ప్రజారోగ్యం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

## డిఎంహెచ్ఒ భాస్కరరావు

**ప్రజాశక్తి - సీతంపేట**

సీజనల్ జ్వరాలను క్షేత్ర స్థాయిలోనే నిర్ధారణ జరిపి తగు చికిత్స అందజేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ధోనుబాయి పిహెచ్‌సి, స్థానిక ఏరియా ఆసుపత్రులను మంగళ వారం సందర్శించారు. ఆరోగ్యకేంద్రంలో రోగుల వైద్య పరీక్షల రికార్డులు, సిబ్బంది హాజరు నమోదు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ల్యాబ్‌లను తనిఖీ చేసి మలేరియా పరీక్షల రికార్డులు పరిశీలించారు. జ్వర నిర్ధారణకు రక్తపూతలు సేకరించి మైక్రోస్కోపిక్ విధానాన్ని అవలంభించాలని ఆదేశించారు. పిహెచ్‌సి ల్యాబ్‌లో స్లైడ్స్ సేకరణ, నిర్వహణ సరిగ్గా లేకపోవడాన్ని గమనించి ఇందుకు తగు వివరణకు ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. దోనుబాయిలో గిరిజన సంక్షేమ హాస్టల్ సందర్శించి సిక్ రూమ్ తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న విద్యార్థికి డిఎంహెచ్ఒ స్వయంగా తనిఖీ చేసి పరీక్షలు చేయించారు. ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుతో కలిసి జ్వరాల వార్డును పరిశీలించారు. మలేరియా కేసులు ఏ మేరకు నమోదు అవుతున్నాయి, చికిత్సా వివరాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ముఖ్యంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంత ప్రజలు వైద్య పరీక్షల కొరకు ప్రయాసపడకుండా వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలోనే జ్వర నిర్ధారణ పరీక్షలు జరిపి ఆరోగ్య కేంద్రాల ద్వారా చికిత్స అందజేసి, ప్రాంతీయ ఆసుపత్రులకు రోగుల తాకిడి తగ్గించాలన్నారు. దోనుబాయి పిహెచ్‌సి పరిధిలో సీజనల్ జ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించి, పర్యవేక్షణ పటిష్టం చేస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయపార్వతి, జిల్లా ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, వైద్యాధికారి డాక్టర్ శివశంకర్, సబ్ యూనిట్ అధికారి మోహనరావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఏరియా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

# సీతంపేట పరిసరాల్లో ఏనుగులు సంచారం

**కురుపాం :** మండలంలోని సీతంపేట, పూతికవలస పరిసర ప్రాంతాల్లో గల అరటి, చెరుకు, పామాయిల్ తోటల్లో మంగళవారం ఏనుగులు గుంపు సంచారిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ పొలాలకు వెళ్లే రైతులు, పరిసర గ్రామాల ప్రజలు, ఆ రహదారి వెంట ప్రయాణించే వాహన చోదకులు అప్రమత్తంగా ఉంటూ ఏనుగులను ఎప్పటికప్పుడు తెలుసుకొని వెళ్లాలని సూచించారు.

# పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆందోళన

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

గుమ్మ లక్ష్మీపురంలో పిజి సెంటర్ ఏర్పాటు చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని, డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో విద్యార్థులు భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బిడ్డిక అనిల్, గుమ్మలక్ష్మీపురం మండల కార్యదర్శి ఆరిక గంగారావు మాట్లాడుతూ జిల్లా ఏర్పాటై నాలుగేళ్లు గడుస్తున్నా మన్యం జిల్లాలో పీజీ సెంటర్ లేకపోవడం దారుణమన్నారు. జిల్లాలో 6 ప్రభుత్వ డిగ్రీ కళాశాలాలు, 13 ప్రవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నప్పటికీ జిల్లాలో పీజీ సెంటర్ లేకపోవడంతో ఉన్నత విద్య కోసం ఇతర జిల్లాలకు వెళ్లలేక చాలామంది విద్యార్థులు డిగ్రీతో చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని అన్నారు. కావున గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, పార్వతీపురం కేంద్రాల్లో పీజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభించి రెండు నెలల గడుస్తున్న డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు నేటికీ ప్రారంభించలేదన్నారు. డిగ్రీ విద్యలో సింగిల్ సబ్జెక్ట్ స్థానంలో డ్యూయల్ మేజర్ సబ్జెక్ట్ విధానం పెట్టాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో ఎఎన్ఎంల నియామకానికి మంత్రి తొలి సంతకం చేసినా నేటికీ ఎక్కడా ఆరోగ్య కార్యకర్తల నియామకం జరగలేదన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మాటలను నిలబెట్టుకోవాలని, తక్షణమే స్కూళ్లు, వసతి గహాలలో ఆరోగ్య కార్యకర్తలను నియమించి విద్యార్థుల మరణాలను అరికట్టాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షించాలని కోరారు. ఫీజు రెంబర్స్మెంట్ బకాయి చెల్లింపులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో తీవ్రవతరమైన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రెవిన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి కె.డేవిడ్, మండల కమిటీ సభ్యులు శివ, లవడు, సాయి, జగన్, మున్న పాల్గొన్నారు.

**పాలకొండ :** విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.అఖిల్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలపై ఈనెల 28 నుంచి 29 వరకు మండలాల్లో ధర్నాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆగస్టు 1 నుంచి 4 వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు ఆగస్టు 5న చలో కలెక్టరేట్ పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న రూ.6400 ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం ప్రాంతాల్లో పీజీ సెంటర్లో ఏర్పాటు చేయాలన్నారు మన్యం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టల్లో వార్డెన్లను, వర్కర్లను వెంటనే నియమించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3వేలకు పెంచాలన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయంబర్స్మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, అభి, సుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.




గుమ్మలక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

# వైసిపికి రానున్నవి మంచిరోజులు

## మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొరతో జగన్

**ప్రజాశక్తి - సాలూరు**

రానున్నవి వైసిపికి మంచిరోజులని, కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డి చెప్పారని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర తెలిపారు. మంగళవారం తాడేపల్లిలో వైసిపి రాజకీయ సలహామండలి సమావేశంలో రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం వైఎస్ జగన్‌ను కలిసిన సందర్భంగా రాజన్నదొరతో ఆయన మాట్లాడారు. ఈ మేరకు స్థానిక విలేఖరులతో ఫోన్‌లో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఇబ్బందుల్లో వున్నారని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి ఎప్పుడు వస్తుందానని ఎదురు చూస్తున్నారని చెప్పినట్లు తెలిపారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులు, వేధింపులకు భయపడొద్దని చెప్పారని రాజన్నదొర అన్నారు.




జగన్‌తో కరచాలన చేస్తున్న రాజన్నదొర

# మున్సిపల్ కార్మికులపై నిర్బంధం తగదు

**ప్రజాశక్తి - సాలూరురూరల్**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులపై పోలీసుల నిర్బంధాలతో దాడులు చేయించడాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తున్నదని నాయుకులు తెలిపారు. నెల్లూరు నగరంలో వర్క్సు ఔట్సోర్సింగ్, ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సాలూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు శంకర్, రవి, రాముడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల ఇప్పటికే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా కార్మికులకు ఇస్తామన్న 62 ఏళ్లరిటైర్మెంట్ వయసు బెనిఫిట్, చనిపోతే ఉద్యోగాలు, దహన సంస్కార ఖర్చుల పెంపు వంటి అంశాలకు నేటికీ జీవోలు ఇవ్వలేదని అన్నారు. పురపాలక శాఖ మంత్రి సొంత జిల్లా నెల్లూరులోనే కార్మికులనును ఔట్ సోర్సింగ్ ఇవ్వడంలో ఉద్దేశం ఏమిటని, అక్కడ ప్రయోగాత్మకంగా పని జరిపి రాష్ట్రమంతా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం కుయొక్తులు పన్నుతుందని విమర్శించారు. ఇదే జరిగితే కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత, కనీస వేతనం హక్కుగా ఉండదని అన్నారు. అప్పుడు జీతం ఎంతైనా తగ్గించి ఇచ్చే అవకాశం ప్రైవేటు ఏజెన్సీలకు వస్తుందని తెలిపారు. ఈ నిర్ణయాలపై కార్మిక వర్గం నెల్లూరులో సమ్మె నిర్వహిస్తే పోలీసులను ఉసిగొల్పి లాఠీఛార్జీ చేయించి అణచివేయాలని కూటమి ప్రభుత్వం చూస్తే దాని పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా అగ్గి రాజుకొని కాలిపోయేది ప్రభుత్వమేనని హెచ్చరించారు. గతంలో 279 జీవోను కార్మికులతో సంబంధం లేకుండా అమలు చేయాలని చూడగా, తెలుగుదేశం ప్రభుత్వం కార్మికుల పోరాటాలకు వెనక్కి తగ్గాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ఆ జీవోను కూడా రద్దు చేశారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇందు, శ్రీను, పోలిరాజు, వెంకన్న, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరులో కార్మికులపై దాడిని ఖండిస్తూ నిరసన




మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

## ఇన్ స్పైర్ మనక్ పోస్టరు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇన్ స్పైర్ మనక్ ( మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్ ) అవార్డ్స్ నామినేషన్లు - 2025 పోస్టరును కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఇఒ బి.రాజకుమార్, ఎస్ఎస్ఎ ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, ఇతర అధికారులు పాల్గొన్నారు.




విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. జియమ్మవలస మండలం పెదమేరంగి తిరుమల సాయి ఉన్నత పాఠశాల నుంచి 2024 - 25లో నవోదయకు ఎంపికైన విద్యార్థులను ఆమె సత్కరించారు. ఈ ఏడాదిలో 12 మంది విద్యార్థులు, ఇప్పటివరకు మొత్తంగా 137 మంది విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం కొత్త నిర్మించిన పాఠశాల ముఖద్వారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి, పాఠశాల ఎకడమిక్ డైరెక్టర్ రౌతు వెంకటరమణ, పాఠశాల హెచ్ఎం సతివాడ శంకర రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నాయకులు పాల్గొన్నారు.

## స్కూల్ వాహనాలు అప్రమత్తంగా నడపాలి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పరిధిలోని పాఠశాల, కళాశాల పిల్లలు, విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలను డ్రైవర్లు అప్రమత్తంగా నడపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవిఎస్ఎస్ ప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన స్కూల్ వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవర్లు, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి ఎనిమిది మందికి జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఐఎస్ఐ మార్కు లేని హెల్మెట్ల వాడకం నేరం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఐఎస్ఐ మార్కులేని హెల్మెట్లు అమ్మినా, కొన్నా చట్టరీత్యా నేరమని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్లను మాత్రమే ఉపయోగించి, ఆపద సమయంలో ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. ఐఎస్ఐ మార్కు లేకపోయినా, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపినా అపరాధ రుసుంతో పాటు మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ విక్రయదారులు, ద్విచక్ర వాహన డీలర్లు ఐఎస్ఐ మార్కులేని హెల్మెట్లు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే షోరూంను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## ఎనిమిదో రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహల్లో వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న నిరసన దీక్షలు మంగళవారం ఎనిమిదో రోజు కొనసాగాయి. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్ర శేఖర్, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడంగి సాయిబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకర్ రావు హెల్త్ వసలంటీర్లు గౌరిశ్వరి, గణేష్, సుజాత, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

## రైతే దేశానికి వెన్నెముక

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రైతే దేశానికి వెన్నెముకని, ఆ రైతు లేనిదే పంటలు పండవని, రైతులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. మండలంలోని బాలగుడబలో ఖరీఫ్ వరి ఉబాలును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు కష్టాన్ని గుర్తించే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని, ఈ ఖరీఫ్ సీజన్లో వరి పంట బాగా పండి ప్రతి రైతు ఆనందంగాఉండాలని అన్నారు.

## వారపు సంతలో పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌లో మంగళవారం జరిగిన వారపు సంతలో నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 3 వరకు మావోస్టుల వారోత్సవాల సందర్భంగా ఎస్‌టిఎఫ్ బృందంతో కలిసి ఏజెన్సీ గ్రామాల్లో గల ప్రధాన రహదారులు, సంతల వద్ద తనిఖీలు నిర్వహిస్తామని, అందులో భాగంగా కాకితాడ, ఉదయపురం ప్రధాన రహదారి ప్రాంతాల వద్ద నాకబంది నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టెండర్ పేరుతో కాలయాపన చేయొద్దు

ప్రజాశక్తి - కొమరాడ

టెండర్ పేరుతో కాలయాపన చేయకుండా పూర్ణపాడు-లాబేసు వంతెన పెండింగ్ పనులు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి ఎంతో ప్రాధాన్యత కలిగిన పూర్ణపాడు లాబేసు వంతెన పనులు ప్రారంభించి 20ఏళ్లు కావస్తున్నా కేవలం 40 శాతం పనులు పూర్తి చేయకపోవడంతో దారుణమన్నారు. వంతెన పూర్తికాకపోవడంతో మండలంలో తొమ్మిది పంచాయతీలు, 42 గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా టెండర్ల పేరుతో కాలయాపన మానేసి ఈ వంతెన పెండింగ్ పనులు చేపట్టేలా ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని కోరారు.

## తామరకండిలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరకండిలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు అధ్యక్షతన స్థానిక ఎంపీటీసీ, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు సారధ్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ ఇంటింటికి వంచన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కూటమి ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎలా వంచిస్తుందన్న విషయాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల వైసిపి శ్రేణులు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




తామరకండిలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

# హమ్మయ్య... పండగ లెక్కలు ఇచ్చారు!

ప్రజాశక్తి - సాలూరు

శ్యామలాంబ పండగకు సంబంధించిన ఆదాయం, వ్యయాల లెక్కల చిట్టాను ఎట్టకేలకు విడుదల చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సమక్షంలో ఉత్సవ కమిటీ పెద్దలు పండుగ సందర్భంగా వసూలైన చందాలు, చేసిన ఖర్చుల వివరాలను వెల్లడించారు. శ్యామలాంబ ఆలయం ఆవరణలో మంగళవారం ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. సుమారు 250 మంది సభ్యులున్న కమిటీ సమావేశానికి సగం మంది కూడా హాజరు కాలేదు. కేవలం 50మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఈ ఏడాది మే 18, 19, 20, 21 తేదీల్లో గ్రామదేవత పండుగ నిర్వహించారు. మంత్రి సంధ్యారాణి కనుసన్నల్లోనే పండగను ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవానికి వచ్చిన విరాళాలు, ఖర్చుల వివరాలు వెలుగులోకి తెచ్చారు. విరాళాల పరంగా రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చిన వారి నుండి రూ.20 విరాళంగా ఇచ్చిన సాధారణ భక్తుల వరకు అందరి వివరాలు లెక్కల్లో పొందుపరిచారు. లక్ష రూపాయలకుపైగా విరాళం ఇచ్చినవారు 25 మందిగా ఉండగా, వారు ఇచ్చిన మొత్తం రూ.51 లక్షలను వెల్లడించారు. పండుగకి వసూలైన మొత్తం విరాళాలు 75,33,247 రూపాయలని, ఉత్సవానికి ఖర్చయిన మొత్తం రూ. 56,49,849 అని చూపించారు. మిగిలిన మొత్తం రూ.18,83,398ను సాలూరు కో-ఆపరేటివ్ బ్యాంకులో ఉత్సవ కమిటీ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ లెక్కలు వెల్లడించడానికి రెండు నెలల సమయం తీసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖర్చులకు సంబంధించి చూపిన లెక్కల్లో ఎక్కువ చూపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లైటింగ్, పండుగ సందర్భంగా ఈవెంట్స్ నిర్వహణకు సంబంధించి చూపించిన ఖర్చులు బాగా ఎక్కువగా చూపించినట్లు జనం గుసగుసలాడుకుంటున్నారు. పండగకు అందరి కంటే ఎక్కువ విరాళం ఇచ్చిన మద్యం వ్యాపారుల సిండికేట్ జాబితాలో చేర్చకపోవడం చర్చనీయాంశమవుతోంది. అయితే ఉత్సవానికి సంబంధించిన విరాళాలు సేకరణ, ఖర్చులు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు మంత్రి సంధ్యారాణి చెప్పడం కొసమెరుపు.

# అందుబాటులోకి ఎఎంసి సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

వ్యవసాయ మార్కెట్ కమిటీ సేవలు రైతులందరికీ అందుబాటులో తెచ్చేలా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు, ఎఎంసి చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టుకు గతంలో ఉన్న టిడిపి ప్రభుత్వం రూ.195 కోట్లు కేటాయిస్తే వైసిపి హయాంలో కేవలం 6శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. వీరఘట్టం మండలం పాలమెట్ట ఛానల్ కు తాను రూ.10 లక్షలు మంజూరు చేస్తే ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్సీ పనులు ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు మాట్లాడుతూ కష్టపడి పని చేసే వారికి ప్రభుత్వం గుర్తింపు ఇస్తుందన్నారు. బిడ్డక సంధ్య రాణికి ఎఎంసి పదవి రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికీ కొంతమంది వ్యక్తులు పార్టీలో అరాచక శక్తుల్లా ఉండి ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడుతున్నారన్నారు కొంతమంది వ్యక్తులు సీతంపేట మండలంలో వైసిపికి మెజార్టీ తగ్గించడానికి తామే కారణమని చెప్పుకుంటున్నప్పటికీ సంధ్యారాణి ఆ మండలంలో కష్టపడి పని చేశారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, ఎంపిపి బొమ్మల భాను, నగర పంచాయతీ చైర్మన్ ఆకుల మల్లేశ్వరి, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, ఎఎంసి మాజీ చైర్మన్ పుదులాపు కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

**గైర్హాజరైన భూదేవి గ్రూపీయులు**

ఎఎంసి చైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్చార్జి పడాల భూదేవి గ్రూపునకు ఎంపికైన ఏడుగురు డైరెక్టర్లు కూడా హాజరు కాలేదు. వీరు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. తమకు ఆహ్వానం అందలేదని వారు చెబుతుండగా అందరికీ ఆహ్వానాలు అందయని ఎమ్మెల్యే గ్రూపీయులు అంటున్నారు.




ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సూరిబాబు

## ఉచిత బస్సు పేరుతో ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దు : సిఐటియు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుందని, దీనివల్ల లక్షలాదిమంది ఆటో కార్మికుల ఉపాధి పోతుందని, ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని, ప్రతి ఏటా పరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి వి రమణ, గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో ఓట్ల కోసం అనాలోచిత పథకాలు అమలు చేసి కొంతమందికి మేలు చేస్తున్నప్పటికీ మరి కొంతమందికి తీవ్రనష్టం చేకూర్చే హామీలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లాలో సుమారు ఐదు వేల మంది కార్మికులు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ ఉచిత బస్సు పథకం వల్ల సుమారు 15 వేల మంది ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని, ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పథకం అమలు చేయాలని, ప్రతి ఏటా పరిహారం చెల్లించాలని, ఇప్పటికే తీసుకున్న ఆటో రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిరుద్యోగం ప్రబలుతున్న నేపథ్యంలో చదువుకున్న యువకులంతా వేరే ఉపాధి లేక ఆటో వృత్తిపై ఆధారపడుతున్నారని, అలాంటి వారి ఆశలు అడియాసలు కాకుండా వారి ఉపాధిని పరిరక్షించేందుకు శాస్త్రీయమైన విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ బి సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి సంచాన ఉమామహేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగభూషణ్, సింహాచలం, కార్తీక్, అప్పలనాయుడు, సంభాన చిన్న, నరసింహ, నారాయణ, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం జియ్యమ్మవలస మండలం చింతల బెలగాం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోట్లాది రూపాయలతో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జోగి భుజంగరావు, రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ చైర్మన్ ఎం.సత్యంనాయుడు, వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు మరడాన దాలి నాయుడు, దాసర రామారావు నాయుడు, గుల్ల దాలినాయుడు మాస్టారు, సోములు మాస్టారు కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**కురుపాం :** మేజర్ పంచాయతీ కురుపాంలో గల శివన్నపేట, పాతకురుపాం, గదబవలస, కాటమ్మదొరవలసలో మండల టిడిపి కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు గూర్చి ప్రజలకు వివరించి సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి సుకేష్ చంద్ర పండ, నాయకులు బి.రామకష్ణ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయిన వారికి పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పిపేటలో ఏనుగుల జోన్‌తో భూమి కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని, మొక్కల ఫలసాయం, భూ సాగును అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఎం నాయకులు రెడ్డి వేణు, రెడ్డి ఈశ్వరరావు, రాయి రాము, గవర వెంకటరమణ అప్పిపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గతంలో ఏనుగులు గుంపు ప్రవేశించి పంటలు నాశనం చేశాయని, కొందరిపై దాడి కూడా చేశాయన్నారు. కానీ పంటలు నష్టపోయిన రైతులకు నేటికీ నష్ట పరిహారము చెల్లించలేదన్నారు. అప్పయ్యపేట వద్ద ఏనుగుల జోన్ ఏర్పాటు చేసి ఏనుగులను సంరక్షిస్తామని అటవీశాఖ అధికారులు పనులు ప్రారంభిస్తే సిపిఎంగా ప్రజలుతో కలిసి అడ్డుకున్నామన్నారు. అప్పుడు అటవీ శాఖ, రెవిన్యూ, జిల్లా అధికారులు రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా వారి భూములకు నష్ట పరిహారం, లేదా వారికి పట్టాలు ఇప్పిస్తామని, వేసిన మొక్కలు ఫలసాయం సాగుకు హామీ ఇచ్చారు, కావున వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏనుగుల జోను వద్దని జరిగే పోరాటంలో నష్టం ఏమీ ఉండదని, ఎవరు భూములు వారి సాగు చేసుకోవచ్చు అటవీ అధికారులు హామీలు ఇచ్చారు వాటిని అమలు చేయాలని కోరారు. లేనిచో ప్రజలును కలుపు కోని ఆందోళన తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## రీసర్వే ప్రక్రియ తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేటలో భూరీసర్వే ప్రక్రియను సర్వే శాఖ అదనపు సంచాలకులు ఆర్.గోవిందరావు మంగళవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి ప్రక్రియపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పలు లే అవుట్లను పరిశీలించిన పరిస్థితులకు అనుగుణంగా అర్హులకు వాటిని మంజూరకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

## పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ త్రివిక్రమ్ రావు అన్నారు. మండలంలోని ఆర్.జమ్ము, నెల్లికెక్కువ గ్రామాల్లో పీ-4 గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించి వారి జీవనోపాధికి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

ప్రజాశక్తి - కొమరాడ

ఈ సీజన్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ కెవిఎస్ పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల చినకేర్జిల ప్రాథమిక ఉప ఆరోగ్యం కేంద్రాలను, పేదకేర్జిల గిరిజన ఆశ్రమం స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి దురుసుగా ప్రవర్తించకూడదని అన్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని, అబా ఐడి క్రియేట్ చేయాలని సూచించారు. మలేరియా జ్వరాల వ్యాప్తి గురించి అడిగి తెలుసుకున్నారు. చినకేర్జిలో జరుగుతున్న ఐఆర్ఎస్ స్ప్రేయింగ్‌ను జిల్లా మలేరియా అధికారి, మెడికల్ ఆఫీసర్‌తో పాటు పరిశీలించారు. సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు అన్ని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించాలని సూచించారు. పేదకేర్జిల స్కూల్‌ను సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎనీమియా కేసులు తగ్గుదలకు తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, జిల్లా మలేరియా అధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**అనారోగ్య విద్యార్థుల చదువులకు అవరోధం కాకూడదు.**

**సీతానగరం :** అనారోగ్య లక్షణాలున్న విద్యార్థుల చదువు, లక్ష్యాలకు అవరోధం కాకూడదని వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి అన్నారు. జోగింపేటలో డాక్టర్ అంబేద్కర్ బాలయోగి గురుకుల పాఠశాలను వసతిగృహాలను వైద్య సిబ్బందితో సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేశారు. విద్యార్థులకు హీమోగ్లోబిన్ పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు, రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు ఏవైనా ఉన్న విద్యార్థులను ఎంతమందిని గుర్తించారు తదితర వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించే ముందు చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై డాక్టర్ సూచనలు, జాగ్రతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, సూపర్ వైజర్ , వైద్య సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు

# అడ్మిషన్ల పెరుగుదలపై హర్షం

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాలు గణనీయంగా పెరిగాయని కళాశాల ప్రిన్సిపల్ టి.మాధవి తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సంవత్సరం కళాశాలలో 300 మందికి పైగా విద్యార్థులు ఉన్నారన్నారు. గతేడాది 287 మంది ఉండగా, ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య పెరిగిందన్నారు. ఈ ప్రవేశాలు ఈనెలాఖరు వరకు జరుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల ప్రవేశాల సంఖ్య పెరిగిందన్నారు. ఈ సంవత్సరం ఉత్తీర్ణత కూడా 90శాతానికి పైగా వచ్చిందన్నారు. నిబద్ధత కలిగిన, నిష్ణాతులైన అధ్యాపకుల విద్యాబోధన వల్ల ఈ ఉత్తీర్ణత సాధించగలిగామన్నారు.

**పార్వతీపురం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల బోధనా పటిమ, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత నోటు పుస్తకాలు, సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు ఉచిత ప్రాక్టికల్ రికార్డుల పంపిణీ, మౌలిక సదుపాయాల కల్పన వెరసి ఈ ఏడాది అడ్మిషన్లు వెల్లువలా వచ్చాయి. విద్యాశక్తి-2 పథకంలో భాగంగా మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్లచే ప్రతిరోజు ఆన్లైన్ తరగతులు, ప్రతి తరగతి గదిలో ఐఎఫ్‌పిల ద్వారా డిజిటల్ బోధన వంటి సౌకర్యాలను గమనించిన తల్లిదండ్రులు పిల్లలను ఎక్కువ సంఖ్యలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించారు. గత విద్యా సంవత్సరంలో ఆగస్టు నెలాఖరుకు 442 మంది విద్యార్థులు జాయిన్ అవ్వగా ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే 457 మంది విద్యార్థులు చేశారు. రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 31తో ముగుస్తుంది. దీని ఇంకా అడ్మిషన్లు పెరిగే అవకాశాలున్నాయని తెలిపారు.

# నిర్మాణ దశలో బీటలు వారుతున్న పిహెచ్‌సి

పజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నాణ్యతా లోపంతో పనులు చేపట్టడంతో నిర్మాణ దశలోనే ఎక్కడికక్కడ బీట్లు వారుతున్నాయి. పిహెచ్‌సి పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రోగులు భయపడుతూనే ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారు. దీంతో అప్పటి వైసిపి ప్రభుత్వం నాడు-నేడు నిధులతో కొత్త భవనం నిర్మాణానికి రూ.కోటీ 67 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణం 2020 అక్టోబర్‌లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే ఈ భవన నిర్మాణ పనులను ఆర్అండ్‌బి అధికారులకు అప్పగించారు. అయితే గుత్తేదారులు పనులను మధ్యలో వదిలేశారు. నాణ్యత లోపం వల్ల భవన నిర్మాణం ఎక్కడికక్కడే బీటలు రావడం కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా తయారైంది. అయితే ప్రస్తుతం వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఈ భవనంపై దృష్టి పెట్టకపోవ డంతో వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పాత భవనంలోనే విధులు నిర్వహిస్తుండడంతో ఇది ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందనే భయం ఏర్పడు తుంది. ఇటీవల ఈ పిహెచ్‌సిలో విషసర్పం సంచరించడంతో సిబ్బంది, రోగులు భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్తగా భవన నిర్మాణ పనులను చేపట్టాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణ దశలోనే బీటలు వారిన పిహెచ్‌సి

# పంటల బీమా అవసరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాసాపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవినాష్ మాట్లాడుతూ మండలంలో గల రైతులు అందరికీ 100 శాతం సబ్సిడీతో గట్లు మీద వేసే కందులు అందిజేస్తామన్నారు. సస్య రక్షణలో భాగంగా ప్రతి రైతు పంట పొలాల చుట్టూ కంది వేసుకోవాలన్నారు. ఈ విత్తనాలు రైతు సేవా కేంద్రాలకు పంపిణీ చేస్తామని, కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రైతులు ఎరువుల విషయంలో 28-28-0 ఎరువును వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

**శత్రు, మిత్ర కీటకాలపై అవగాహన అవసరం**

**సాలూరు రూరల్ :** రైతులకు శత్రు, మిత్ర కీటకాల గురించి అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయధికారి కె.శిరీషా తెలిపారు. గిరిశిఖర పంచాయితీ జిల్లేడు వలస పంచాయతీలో గల వివిధ గ్రామాల్లో స్థానిక రైతులతో కలిసి పొలండి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గిరిజన రైతులు పండించే పంటకు క్రిమి కీటకాలను పంటలను నాశనం చేసే పురుగులను తెలుసుకొని వాటికి ఏం అవసరమో అవే మందులను వాటిపై పిచికారీ చేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందు సూక్ష్మ క్రిములు పురుగులను గురించి ఒక నమూనా చిత్రంగా వేయించి అక్కడున్న గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన ఎరువులు అన్ని రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని, ఎవరూ కూడా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లేడు వలస సర్పంచ్ ప్రతినిధి సీదరపు అప్పారావు, ఎఇఒ, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

**పాచిపెంట :** రైతులు మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.330తో పంటల భీమా చేయించుకోవాలని, ఆఖరి తేదీ ఈనెల 31 అని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని మిర్తివలసలో విఎఎ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. రైతులంతా తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. వరి పంటకు ఎకరానికి రూ.800తో ఆగస్టు 15 వరకు సమయం ఉందని, మొక్కజొన్న రైతులకు సమయం తక్కువగా ఉన్నందున దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రాల ద్వారా లేదా గ్రామ సచివాలయాల ద్వారా లేదా పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా పంటల బీమా చేయించుకోవాలని అన్నారు. మొక్కజొన్న, వరి పంటలపై బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు బ్యాంకుల్లో ప్రీమియంను మినహాయించమని కోరాలని తెలిపారు. ప్రస్తుతం యద వరి పంటలపై నానో యూరియా, డిఎపి వాడుకోవడం ద్వారా ఎరువుల వృథాతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం పత్తిపై పేను బంక ఆశించిందని, దీని నివారణకు తయోమెథాక్సిమ్ మందును 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్క బాగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ పెద్ద కొత్తవి పోలినాయుడు మాట్లాడుతూ తమ గ్రామానికి ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు.



పత్తిని ఆశించిన పేను బంక తెగులు నివారణపై సూచనలు ఇస్తున్న ఎఒ తిరుపతిరావు

## అనాధ బాలికలకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనాధ బాలికలకు కెబిఎంబిఎఫ్‌సి సంస్థ సమకూర్చిన సైకిళ్లను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరిపివలస ఉన్నత పాఠశాలలో విద్యాబోధన బేసుగ్గా సాగుతోందని, ఉపాధ్యాయులు జీతాల కోసం కాకుండా ఏదైనా సాధించాలనే తపనతో పని చేస్తున్నారని కొనియాడారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్యాభ్యాసం గురించి, పాఠశాలలో వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే బడి ఈడు గల పిల్లలను బడిలో చేర్పించిన పలువురు తల్లిదండ్రులను ఎమ్మెల్యే సన్మానించారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించి విద్యారంగానికి వారు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు. కాగా మరిపి వలస హైస్కూల్లో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా ఉండడాన్ని పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు వినతిపత్రం అందజేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ వైర్లు తొలగింపునకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఎంఇఒలు, ఉపాధ్యాయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాలను అధికారులు అధిగమించాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు అన్నారు. మంగళవారం సీతంపేటలో పర్యటించిన ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, ఇంటింటికి చెత్త సేకరణ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. తడి, పొడి చెత్త వేరు చేయాలన్నారు. వర్మీ కపోస్ట్ తయారు చేసి పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలన్నారు. గ్రామపంచాయతీ పరిపాలనపై సమీక్షించారు. 2025 -26 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు మదింపు ప్రక్రియపై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. రికార్డులు పరిశీలించారు. వీధిలైట్లు గురించి ఆరా తీశారు. 14వ ఆర్థిక నిధులు ఖర్చులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.సత్యం, డిపిఆర్‌సి, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.